౨వ పాఠం **నవంబరు 21-27**

ప్రవక్తలను పరీక్షించుట

సబ్బాతు మధ్యాహ్నము : **నవంబరు 21**

ఈ వారమునకు చదువ వలసిన వచనములు : దానియేలు 10:7-19; ద్వితియో 13:1-5; యెషయా 8:20; యోహాను 11:25; అపొ.కా. 15:36-39; యిర్మియా 28:9,15-17.

కంఠతవచనం : "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" (1యోహాను 4:1).

భూమి మీదున్న రత్నాలలో ఎక్కువ విలువైనది ఒక నిజమైన వజ్రం. అనేక ఇతర పదార్థములనుండి నిజమైన వజ్రాలను పోలినట్లు ఉన్న వజ్రాలను తయారుచేయవచ్చు. అయితే అవి విలువలేనివి. అందుచేత వజ్రము నిజమైనదో లేక నకిలీదో అని ఎవరైనా ఎట్లు తెలుసుకుంటారు? దానికి ఒకే మార్గముంది. దానిని పరీక్షించుట. కొన్ని సామాన్య పరికరములతో ఎవరి ఇంటి యొద్ద వారే వజ్రమును పరీక్షించవచ్చు. కొందరికైతే వృత్తి నిపుణిని సహాయము అవసరము ఉంటుంది. ఎక్కువ జరిపే పరీక్షలు వాటంతట అవే చివరివి కావు. అయితే వజ్రము గనుక అనేక పరీక్షలనుండి బయటకు వస్తే అప్పుడది నిజమైన వజ్రముగా నమ్మకము కలుగుతుంది.

భూమి మీదున్న పదార్థములలో వజ్రము బహు గట్టిది. వజ్రమునకున్న బలమైన సామర్థ్యము ఏమిటంటే అది చాలా తీవ్రమైన ఉష్ణోగ్రతలను మరియు నాటకీయముగా తీవ్రమైన ఉష్ణోగ్రతలలో మార్పులు చేసినను అది తట్టుకొనగలదు. వజ్రమును నీవు పరీక్షించాలనుకుంటే, దానిని అధిక ఉష్ణోగ్రతను కలిగించే జ్యోతితో వేడి చేయవచ్చును. అటుతరువాత అతిగా వేడెక్కిన ఆ వజ్రమును అతి చల్లని నీటిలో విడిచి పెట్టాలి. ఇటువంటి హెచ్చుతగ్గుల వేడికి నిజమైన వజ్రములో ఎటువంటి మార్పు కనబడదు గాని అదే నకిలీ వజ్రమైతే అక్కడికక్కడే ధ్వంసమైపోతుంది.

ఏ వజ్రము కంటెను ప్రవచించు కృపావరము అతి విలువైనది. అయితే ప్రవచించు కృపావరమును నేను కలిగియున్నానని చెప్పుకున్నంత మాత్రాన అతను లేక ఆమె ముఖ విలువను బట్టి ఇతరులు ఎంతమాత్రము ఒప్పుకోరు. ప్రవచించు కృపావరము కలిగియున్నానని చెప్పుకునే వారు పరీక్షింపబడాలి లేక అతనికి లేక ఆమెకు ఉన్నదని నిరూపించే పరీక్షలకు నిలబడాలి. ఈ వారం మనము బైబిలు ప్రవక్తల ప్రామాణికతను నిరూపించే పరీక్షలను బైబిలు సూచించే నియమాలతోనే తెలుసుకొనబోవుచున్నాము.

– నవంబరు 28, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం నవంబరు 22

మానవ ప్రమేయములేని పాత్ర

ఇశ్రాయేలీయుల నిర్గమము కాలములో వారి మధ్య ప్రవచించు కృపావరమును అనుగ్రహించబోవుచున్నట్లు ప్రభువు తన ప్రజలతో మాట్లాడెను. "నా మాటలు వినుడి. మీలో ప్రవక్త యుండిన యెడల యెహోవానగు నేను దర్శనమిచ్చి అతడు నన్ను తెలిసికొనినట్లు కలలో అతనితో మాటలాడుదును" (సంఖ్యా 12:6).

ఒక ప్రవచన వర్తమానము మరియు ప్రవచించుటకు వచ్చే పిలుపుతో మానవ ప్రయత్నము లేని పాత్ర ఉంటుంది. అది మానవులకు ఉండే తలంపులకు మించిన భావములను కలిగియుంటుంది. ప్రవక్త నేరుగా దేవుని యొద్ద నుండి సందేశమును స్వీకరిస్తాడు. దేవుని వద్ద నుండి వచ్చే ఆ సందేశములు తరచుగా ప్రవచనమునకు సంబంధించిన కలలు, దర్శనముల రూపములోను అనుగ్రహింపబడును (దానియేలు 8:1; యెషయా1:1; అపొ.కా. 9:10 మొదలైనవి) వాటితో పాటు ఆ సమయములో ఆ ప్రవక్తలో భౌతికమైన కొన్ని అసాధారణ విషయాలు చోటు చేసుకుంటాయి.

ప్రవక్తయైన దానియేలు దర్శనములో ఉన్నపుడు ఆయనలో సంభవించిన భౌతికమైన మార్పుల జాబితాను సిద్ధము చేయుడు. (దానియేలు 10:7-19 చూడుడి).

దానియేలుకు దర్శనము కలిగినపుడు అతడు తన శక్తిని కోల్పోయాడు. ఆ దర్శన అనుభవములో ఉండగా సమయమంతా అతడు దేవుని మీద ఆధారపడి యుండెను. ఆయనతో పాటు ఉన్న ఇతరులు దర్శనములోనికి వెళ్ళలేదు గాని వారి మధ్యన ఉన్న దైవ సన్నిధి ఎంతో బలముగా ఉండుట చేత దానిని తట్టుకోలేక భయముతో అచ్చటి నుండి పారిపోయిరి. అయితే ప్రవక్త ప్రవచనముకు సంబంధించిన వర్తమానమును స్వీకరించుచుండగా అతడు ఆ వర్తమానమును గుర్తించుకొనుట కొరకు, అతనిలో దేవుడు కొన్ని భౌతికమైన కదలికలను అనుమతిస్తాడు.

ద్వితియో 13:1-5 ప్రవచన వరము గూర్చి ఏమి బోధించుచున్నది?

బహిరంగముగా కనిపించే కొన్ని భౌతికచర్యలు ఒక మానవ ప్రమేయము లేకుండా ఒక శక్తి పని చేయుచున్నాడనే విషయాన్ని చూస్తున్నాము. ఆ భౌతిక చర్యలు దేవుడు ప్రేరేపించగా సంభవించినవి. సాతానుడు కూడా మానవ ప్రమేయము లేని రీతిలో పనిచేయగలడు. అయితే అక్కడ ప్రవచించుటకు అనువైన చర్యలు సంభవిస్తున్నాయని చెప్పుటకు ఏ ఒక్క ఆధారము ఉండదు. దర్శనము కలుగుచున్న సమయములో ప్రవక్తల భౌతిక సూచనలే కాకుండా ప్రవక్తలు పరీక్షించబడాలి. ప్రవక్తలలో సంభవించు కొన్ని మానవ ప్రమేయము లేని కదలికలను బట్టి అతనిని యదార్ధమైన ప్రవచించు వరమును పొంది యున్నదనుటకు దర్శనము కాదు. ఒకరిని దేవుని వర్తమానికునిగా స్థిరపరచుటకు అతనిలో ప్రవక్తను బైబిలు పరీక్షించే విషయాలన్నియు అతను కలిగియుండాలి. అయితే చరిత్ర

ప్రకారము అనేకమంది అబద్ద ప్రవక్తలు కూడా సమాజములో ఉన్నారు (మత్తయి 7:15 చూడుడి).

కొన్ని సంస్కృతులలో ఇతరులకన్నా వారిలో మానవ ప్రమేయము లేకుండా సంభవించే సామాన్య క్రియలు అనేకముంటాయి. అట్టి క్రియలు నిజముగా దేవుని యొద్ద నుండి కలిగినవేనాయని ఎందుకు తెలుసుకొనవలెను?

సోమవారం **నవంబరు 23**

బైబిలుతో ఐకమత్యం

మానవులమైన మనము తరచుగా విబేధాలతో మోసపూరితముగా జీవిస్తుంటాము. అయితే దేవుడు అబద్దమాడడు (సంఖ్యా 23:19 చూడుడి). ప్రవక్తల ద్వారా దేవుడు ప్రజలకు ఇచ్చే ప్రవచనమునకు సంబంధించిన వర్తమానము స్థిరమైనదిగా ఉంటుంది. దేవుడు మార్పు చెందనివాడు. ఆయన ఇచ్చే వర్తమానాలు కూడా మార్పు చెందనివిగా సత్యమును కలిగి ఉంటాయి. ప్రవచన వర్తమానము దేవుని వాక్యానికి విరుద్దముగా ఉండదు.

యెషయా 8:20 చదువుడి. దేవుడు వివరిస్తున్న ప్రాముఖ్య విషయము ఏమిటి?

ఎవరైనా దైవావేశము వలన ప్రవచించగలుగుచున్నామని చెప్పుచున్నచో బైబిలుకున్న ప్రమాణములతో చూడవలసియున్నది. ప్రవక్తలు ఏమి ప్రకటించుచున్నారో దానికి సంబంధించి బైబిలు ఏమి చెప్పిందో పోల్చి చూసి ప్రవక్తలను పరీక్షించవలెను. ఒక యదార్ధమైన ప్రవక్త బైబిలు సత్యము నుండి దూరమైపోవుట గాని, దానిని తగ్గించి చూపించుటగాని లేక దానికి విరుద్దముగా ప్రవచించుట గాని ఎన్నడూ చేయడు. అందువలననే ప్రభువును వెంబడింప గోరు వారు లేఖనాలకు సంబంధించిన జ్ఞానమును కలిగియుండాలి. వారు అబద్ద ప్రవక్తల ప్రవచనాల ద్వారా మోసపోకుండా చూచుకొనవలెను.

పాతనిబంధన మరియు క్రొత్త నిబంధనలో ఒకరి తరువాత ఒకరు వచ్చిన ప్రవక్తలు వారికి ముందు వచ్చిన ప్రవక్తలిచ్చిన వర్తమానాలను పైకెత్తి చూపించి వాటిని బలపరచి, ఆ ప్రామాణికమునే వారనుసరించి ఇప్పుడు ప్రవచించే పరిచర్య వారు చేయుచున్నట్లు ఒప్పుకొనుచున్నారు. తరువాత బైబిలు ప్రవక్తలు దేవుని ప్రణాళికల విషయములో అదనపు పరిజ్ఞానమును ప్రజలతో పంచుకొనేవారు. అయితే ఈ ప్రక్రియలో దేవుడు ఆరంభములోనే ఇచ్చిన ప్రాథమిక నియమావళిని దేవుడు అప్పటికే ఇచ్చిన భావములకు విరుద్దముగా వారు చెప్పేవారు కాదు.

2పేతురు 1:19-21; రోమా 15:4 మరియు యాకోబు 1:17 మనకు దేవుని గూర్చి శతాబ్దాల తరబడి ఆయన ఇచ్చిన ప్రవచన వర్తమానములను గూర్చి మనకేమి బోధించుచున్నవి?

.....

దేవుని రక్షణ ప్రణాళికను గూర్చి అర్థము చేసుకొనుటకు ఆయన స్వయముగా ఆది 3:15లో బయలు పర్చిన మొదటి ప్రవచనమునకు పాతనిబంధన గ్రంథము పునాదిగా నిలిచియున్నది. బలి యర్పణ విధానము రక్షణ ప్రణాళికకు దృష్టాంతములుగా ఉన్నది. అయితే రక్షణ ప్రణాళికలోని వివరములు అనగా యేసుక్రీస్తు దేవుని గొఱ్ఱెపిల్లగా ఏవిధముగా వస్తాడు, జీవిస్తాడు మరియు మానవుల కొరకు ఏవిధముగా మరణిస్తాడు అనే విషయాలను అంచెలంచెలుగా తరువాత దేవుడిచ్చిన ప్రవచనాలు వివరించెను. బైబిలును అర్థము చేసుకునే స్థితిలో ఉన్నపుడు దేవుడు తన ప్రజలకు సత్యమును వివరముగా వెల్లడిపరచును. ఇట్టి విధానములోనే బైబిలు దేవుని ప్రవచనాలను బయలుపరచును. ఆవిధముగా ప్రతి తరమునకు చెందిన తన ప్రజలకు దేవుడు సత్యమును బయలుపర్చి లోతైన అవగాహన కలుగునట్లు ఈ విధానము సహకరిస్తుంది. ఈ విధానమునే "సత్యము విప్పబడి వెల్లడి పరచుట లేక వృద్ధి పొందుచున్న సత్యము" అనే భావము గతించిపోయిన తరమునకు చెందిన ప్రజలకన్నా రాబోవు తరములకు చెందిన ప్రజలకు తరచుగా దేవుని సత్యమును గూర్చి ఎక్కువ లోతైన అవగాహన కలిగి ఉంటారని అర్థమగుచున్నది.

అయితే ఇక్కడ పేర్కొనవలసిన ప్రధాన విషయమున్నది దేవుడు పూర్వకాలములో తన ప్రజలకు అనుగ్రహించిన సత్యమును నూతనముగా బయలుపర్చబడిన సత్యము వ్యతిరేకించదు.

మంగళవారం **నవంబరు 24**

క్రీస్తు శరీరధారియై వచ్చెను

1యోహాను 4:1-3 ప్రకారము యేసుక్రీస్తు శరీరధారియై ఈ లోకములోనికి అవతరించెను అనే సత్యము ప్రపంచములోని ఇతర పెద్ద మతములకు చెందిన ప్రవక్తలనబడే ప్రజలు ఒప్పుకొనరు. ఈ మతము ఆ మతము అని కాకుండా ఆధ్యాత్మిక ప్రపంచానికి చెందినవారు కూడా క్రీస్తు శరీరధారియై వచ్చెనని ఒప్పుకొనరు. "ఒక వ్యక్తి యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని ఒప్పుకొనునో అతడు లేక ఆమె దేవుని సంబంధమైన వారు. ఎవరు ఒప్పుకొనరో వారు దేవుని సంబంధమైన వారు కాదు (1యోహాను 4:3).

యోహాను ఈ వాక్యాలు వ్రాసినపుడు, యేసు ఒక మానవుడు కాదు, కేవలము ఒక మానవుడుగా మాత్రమే కనిపించేవాడని అబద్ద బోధకులు బోధించు అంశమును గూర్చి ఆలోచిస్తూ వ్రాసాడు. ఈ పరీక్షను కొందరు ఇంకా ముందుకు తీసుకొని వెళ్ళారు. యేసు భూమి మీద నిజమైన మనిషిగా జీవించాడు అని ఒక ప్రవక్త ఒప్పుకొని తీరాలని చెప్పుటలేదు. యేసును గూర్చి ఎక్కువ మంది క్రైస్తవులు నమ్మేది ఇదే. ఆ సమయములో యోహాను ప్రత్యేకమైన విషయము గూర్చి చర్చించాడు. ఏదిఏమైనా యోహాను పలికిన మాటలు ప్రత్యేక పరిస్థితులకు అవసరమైనను, భవిష్యత్తు తరముల వారికి ఇందులో ముఖ్య సత్యములు ఇమిడియున్నవి.

ఇక్కడ పేర్కొనబడిన వాక్యాలు యేసును గూర్చి ఏమి చెప్పినవి? యోహాను 3:16; 2కొరింథి 5:21; యోహాను 11:25; హెబ్రీ 4:14,15; యోహాను 14:1-3.

నిజమైన ప్రవక్తలు దేవుడైన యేసు శరీర ధారిగా వచ్చినను, యేసు నిజమైన మానవుడై యుండెనని నమ్మవలెను. ఆ ప్రవక్తలు యేసును గూర్చిన ప్రతి సత్యమును కూడా వారు స్వీకరించాలి. యేసు యొక్క పరిచర్య, పాపరహితమైన జీవితము, పాప పరిహారార్థమైన బలిగా మరణించుట, ఆయన పునరుత్థానము, పరలోకములో ఆయన చేయుచున్న ప్రధాన యాజకుని పరిచర్య, ఆయన రెండవ రాకడను గూర్చిన విషయము ఇవన్నియు ఒక ప్రవక్త నమ్మవలెను. భూమి మీద యేసు జీవించెను అనే విషయము తెలివి తేటలకు సంబంధించిన అంగీకారము కాదు. ఒక ప్రవక్త బోధించే అంశములో యేసు కేంద్ర బిందువై యుండాలి తప్ప యేసును ఏదో అంశమునకు జత చేయుట కాదు. అతడు లేక ఆమె ఒక ప్రవక్తగా, వారి వర్తమానాల ద్వారా యేసుతో రక్షణ బాంధవ్యము కలిగియుండేటట్లు ప్రజలను నడిపించాలి.

దైవావేశము వలన పరిశుద్ధాత్మ ద్వారా ప్రవక్తకు అనుగ్రహించబడిన దేవుని వాక్యము వేగుచుక్కయైన యేసు మన హృదయములో ఉదయించి మనలో ఉన్న అంధకారమును తొలగించే పనిలో కేంద్ర బిందువుగా పనిచేస్తుంది. ప్రవచించు వరము మనలను యేసుతో ఐక్యపరచి, నిరంతరము యేసువైపు చూచునట్లు మనకు సహాయపడును.

యేసు రక్షకుడుగా పైకెత్తి చూపే ప్రవక్తలు వారిని వారు హెచ్చించుకొని లేక వారిని అనుసరించి జీవించే మనుష్యులను వారికొరకు సిద్ధము చేసుకొనరు. (అపొ.కా. 4:12) వారు ఎల్లప్పుడు పరిచర్య చేయుటకు సిద్ధముగా ఉంటారు. గాని ఏ ప్రజల కొరకు వారు పంపబడిరో వారి చేత పరిచర్య చేయించుకొనరు. రేపటి పాఠములో చూడబోయే అంశము ప్రకారము దేవుని ప్రవక్తలు మన వంటి సామాన్య మానవులే. మన వలే పాపులుగా వారికి సువార్త అవసరమే.

యేసు పరిపూర్ణమైన దేవుడు. మన స్థానములో ఆయన మరణించెను. మన పాపములనిమిత్తము శిక్షను భరించెను. ఈ ముఖ్య విషయమును గ్రహించుట ఎందుకు మన విశ్వాసమునకు కేంద్ర బిందువై యుండాలి? ఈ బోధను మనము నిర్లక్ష్యము చేస్తే ఏమి పోగొట్టుకుంటాము?

బుధవారం **నవంబరు 25**

నిజమైన ఫలములు

కొండమీద ప్రసంగములో (మత్తయి 5-7) క్రైస్తవ సంఘమునకు పునాదులను యేసు నియమించెను. ఆ పునాదిలో దేవుని వర్తమానములను ప్రవచించు పరిచర్య ఒక భాగమై ఉంటుందని స్పష్టముగా కనిపించుచున్నది. యేసు అబద్ద ప్రవక్తలను గూర్చి

ఈవిధముగా హెచ్చరించెను "కాబట్టి మీరు వారి ఫలములను బట్టి తెలిసికొందురు" (మత్తయి 7:20).

కొంత కాలము పరిశీలించిన తరువాతే ఏదైనా ఒక ఫలమునకున్న లక్షణమును గూర్చి ఒక అభిప్రాయమునకు రాగలము. ఒక ప్రవక్తను పరిశీలించినపుడు, ఆ ప్రవక్త ప్రజలను దేవుని యొద్దకు నడిపిస్తున్నాడా లేక దేవుని నుండి ప్రజలను దూరము చేయుచున్నాడా అనే విషయము నిర్ణయింపబడుతుంది.

యోనా 1:1-3; అపొ.కా. 15:36-39; గలతీ 2:11-14 చదువుడి. ప్రవక్తలను గూర్చి ఈ వాక్యాలు మనకు ఏమి బోధించుచున్నవి?

.....

ఒక వ్యక్తి ప్రవక్తగా జీవించడమంటే అతడు పాపరహితుడు గాను లేక వ్యక్తిగతముగా తప్పులెన్నడూ చేయని మనిషిగా ఉంటాడని దాని అర్థము కాదు. బైబిలు ఉదాహరణలలో యోనా, పౌలు మరియు పేతురు వంటి మనుష్యులు చేసిన పొరపాట్లను లేక వారి స్వభావములో ఉన్న లోపాలను మనము చూడగలము. తప్పిదములు చేయనివాడు దేవుడొక్కడే మరెవరును లేరు. దేవుని ప్రవక్తలు ఎన్నడూ తప్పులు చేయని మనుషులుగా ఎంచబడలేదు. మనవలెనే ప్రవక్తలందరికి పాపమునకు సంబంధించిన బలహీనతలున్నవారే. అయినప్పటికి వారు దేవుని వైపు తిరిగి జీవించినచో వారు బోధించే వర్తమానమును నిరాకరించే విధముగా వారి శైలి ఉండకూడదు.

ఏ ఒక్క ప్రవక్త కూడా యేసు యొక్క మాదిరిని పరిపూర్ణముగా వారి జీవితములో అనుసరించలేదు. అయితే యదార్థమైన ప్రవక్త దేవుని రాజ్య జీవిత విధానమునకు నియమాలకు బద్దుడుగా ఉంటాడు (మత్తయి 7:16-20) ఎవరైనను దేవుని ప్రవక్తగా ప్రకటించుకొని అతడు లేక ఆమె జీవిత విధానము బోధించు వర్తమానమునకు విరుద్ధమైతే అట్టి ప్రవక్త విషయమై అనుమానములుంటాయి.

ప్రవక్తగా పిలువబడుట కష్టతరమైన విషయమైనా, అనేకమంది ప్రవక్తలు వారి పరిచర్య కాలములో "మంచి ఫలములను ప్రదర్శించిరి. ఉదాహరణకు మోషే విజయవంతముగా ఇశ్రాయేలు జనాంగమును అరణ్యముగుండా నడిపించెను" (ద్వితియో 34:10-12) హగ్గయి చూపించిన విశ్వాస్యతను బట్టి యూదాలో జీవించుచున్న దేవుని ప్రజలు 19 సం॥రాలుగా రెండవ దేవాలయ నిర్మాణ పనులు ఆగిపోయి ఉన్న తరుణములో దాని పునఃనిర్మాణ పనులు ఆరంభించారు. (హగ్గయి 1:12)

నలుగురు యూదా రాజుల క్రింద దృఢమైన సంకల్పముతో సేవ చేసిన యెషయా ఆ రాజుల కాలములో ఉన్న కోలాహల పరిస్థితులలో వారికి మార్గ నిర్దేశము చేస్తూ వారి దృష్టిని మెస్సియా వైపు త్రిప్పెను. (యెషయా 39:5,6; యెషయా 53:4-6) దానియేలు

హృదయపూర్వకముగా పాపములను ఒప్పుకొనిన విధానమును మరువరాదు. (దానియేలు 9:15) యిర్మియా కన్నీళ్ళతో తన నిబద్ధతను నిరూపించుకొనెను (యిర్మియా 9:1) దేవుని ప్రవక్తలు తరచుగా హింసలకు గురి కాబడినను దేవుని యెడల, ప్రజల యెడల ఎల్లపుడు చూపిన యదార్ధ ప్రేమ ఫలభరితమైన సేవకు ముద్రగా మిగిలిపోయెను.

దేవుని ప్రజలైన స్త్రీ, పురుషులు వారి క్రియల ద్వారా, పొరపాట్లతో కూడిన వారి ప్రవర్తన ద్వారా మిమ్ములను నిరుత్సాహపరచుచున్నారా? అటువంటి అనుభవములనుండి ఏ ప్రాముఖ్యమైన పాఠములను మీరు నేర్చుకొనగలరు?

గురువారం **నవంబరు 26**

నెరవేరిన ప్రవచనములు

ఒక ప్రవక్త అనగా భవిష్యత్తును గురించి తెలియజేసే ఒక వ్యక్తిగా ప్రజలు భావిస్తూ ఉంటారు. అయితే అది నిజమైనప్పటికి, ప్రవక్త నిర్వహించే పనిలో అదొక భాగము మాత్రమే. ఒక ప్రవక్త చేసే పని ఇంకా చాలా విశాలమైనది. ప్రజలను తిరిగి దేవుని వాక్యము వైపునకు ప్రవక్తలు త్రిప్పుతారు. వారికి సలహాలు ఇస్తారు. వారిని హెచ్చరిస్తారు.

ప్రజలను భవిష్యత్తులో సంభవించబోయే సంఘటనలకు సిద్ధమయ్యే విధంగా వారికి సహాయపడుటే గాక, ప్రవక్తలు భవిష్యత్తును గూర్చి ముందుగానే ఎందుకు తెలియజేస్తారు? (యిర్మియా 28:9,15-17 చూడుడి).

నెరవేరిన ప్రవచనాలను అనుసరించి ఒక ప్రవక్తను పరీక్షించవచ్చు. ఒక ప్రవక్త యదార్ధవంతుడు అని ఒప్పుకొనుటకు వారు చేసిన ప్రవచనాలు నెరవరవలసియున్నది. "ప్రవక్త యెహోవా నామమున చెప్పినపుడు ఆ మాట జరుగకపోయిన యెడలను ఎన్నడును నెరవేరకపోయిన యెడలను అది యెహోవా చెప్పిన మాట కాదు. ఆ ప్రవక్త అహంకారము చేతనే దాని చెప్పెను గనుక దానికి భయపడద్దు" (ద్వితియో 18:22). ఈ పరీక్ష కొన్ని సవాళ్ళను ఎదుర్కొనవలసి ఉంటుంది. కారణమేమంటే కొన్ని ప్రవచనములు నెరవేరుటకు దానికి సంబంధించిన షరతులు కొన్ని ఉంటాయి. అనగా ప్రవక్త ప్రవచించినట్లు ఆ సంఘటనలు నెరవేరాలనుకున్నట్లయితే, వాటికి ముందుగా నియమించిన షరతులు గైకొనవలసి యున్నది. లేనియెడల ఆ ప్రవచనములు నెరవేరకపోవచ్చును.

ఈ నియమమును యోనా మరియు అతడు నినివే పట్టణమునకు వ్యతిరేకముగా ప్రవచించవలసిన హెచ్చరికకు సంబంధించి చూడగలము. యోనా ఇవ్వవలసిన సందేశము క్లుప్తముగాను, విషయము సూటిగాను ఉండాలి. "యోనా ఆ పట్టణములో ఒక దిన ప్రయాణమంత దూరము సంచరించుచు – ఇక నలువది దినములకు నినెవె పట్టణము నాశనమగునని ప్రకటన చేయగా" (యోనా 3:4). అయితే యోనా ప్రవచించినట్లు సంభవించలేదు. ఎందువలన?

యిర్మియా 18:7-10 చదువుడి. షరతులతో కూడిన ప్రవచనము విషయమై ఈ వాక్యాలు మనకు ఏమి బోధించుచున్నవి?

దేవుడు పంపిన వర్తమానముతో పాటు ఇచ్చిన షరతులకు ఆయన ప్రజలు ఏ రీతిగా స్పందించారో ఆ స్పందన బట్టి ప్రవచనముల నెరవేర్పు ఆధారపడి ఉంటుంది. దేవుని ప్రజలు గనుక వారి వైఖరిని వారి ప్రవర్తనకు మార్చుకొనిన యెడల ముందుగానే ప్రవచించబడిన ప్రవచనము నెరవేరకపోవచ్చు. నినివే పట్టణ ప్రజలు యోనా ప్రవచించిన దేవుని వర్తమానమును వారి హృదయములకు చేర్చుకొని వారి మార్గములను, నడవడిని మార్చుకున్నందున, దేవుడు ముందుగా అనుకున్నట్లు నినివే పట్టణమును నాశనము చేయలేదు" (యోనా 3:10).

ఆ సంఘటన జరిగిన తరువాత వచ్చిన తరముల వారు ఈ ప్రవచన హెచ్చరికను మరచిపోవుటచేత, మరొకసారి నినివే పట్టణము దుష్టముతో నిండి క్రూరమైన స్థలముగా మారిపోయెను. అంతట దేవుడు ఆ పట్టణమును నాశనము చేసెను. దేవునికి భవిష్యత్తు తెలుసు. మనకైతే తెలియదు. మనము జీవించుచున్నపుడు తీసుకునే నిర్ణయాలు, భవిష్యత్తులో జరిగే యదార్ధ సంఘటనలను నిర్ణయిస్తాయి.

షరతులతో కూడిన ప్రవచనమును గూర్చి అర్థం చేసుకొనుట ఎందువలన ప్రాముఖ్యము. ఇట్టి అవగాహనతో కూడిన జీవిత విధానము బైబిలు సత్యములను గ్రహించుటకు మనకెట్లు సహాయపడును?

శుక్రవారం **నవంబరు 27**

అదనపు అధ్యయనము - "రుచి చూచి తెలుసుకొనుడి"

ఎలెన్ జి వైట్‌కు ప్రవచించు కృపావరమున్నదని ఎడ్వంటిస్టు సంఘ విశ్వాసులు అంగీకరించుటచేత ఆ సంఘము ఆరంభించబడినది మొదలు నేటి వరకు బైబిలు ప్రవక్తలు ఎదర్కొనిన సమస్యలవంటివి ఆమె కూడా ఎదుర్కొన్నారు. డిశంబరు 1844లో ఎలెన్‌కు వచ్చిన ప్రథమ దర్శనము తరువాత ఆమె ప్రవచించిన విషయాలను గూర్చి కొంతమంది ప్రశ్నించుట ఆరంభించారు. ఆమె దేవుడనుగ్రహించిన ప్రవచన వరమును సమర్ధించుటకు 7వ దిన సబ్బాతును గైకొనే ఎడ్వంటిస్టు సభ్యులు (సెవెంతు డే ఎడ్వెంటిస్టు సభ్యులుగా గుర్తింపబడిరి) వారి వాదనలను బలముగా వినిపించిరి.

మొదటగా వారు (సబ్బాతును గైకొన్న సభ్యులు) అంత్యకాలము అంతమువరకు ప్రవచించు కృపావరము నిశ్చయముగా ఉంటుందని సమర్ధిస్తూ వేదాంతపరమైన నిరూపణతో సమాధానం ఇచ్చారు. నవీన కాలములో ప్రవచించు కృపావరము ప్రదర్శింపబడుతుందని యోవేలు 2, ప్రకటన 12:17 ఇతర లేఖనముల ద్వారా దేవుని కడవరి కాల ప్రజలను అది గుర్తించే ఒక ముద్రగా ఉంటుందని బైబిలు వివరిస్తున్నది). (గెర్‌హర్డు ఫనడత్ ప్రవచించు

కృపావరము మరియు దేవుడు శేషించిన క్రైస్తవ సంఘము) – ప్రవచించు కృపావరము అధ్యాయము 4.

రెండవదిగా, తొలి ఎడ్వంటిస్టు విశ్వాసులపై ఎలెన్ జి వైట్‌కు అనుగ్రహింపడిన ప్రవచించు కృపావరము అనుకూలమైన ప్రభావమును కలిగిస్తున్నట్లు గమనించారు ఉదా: తొలి ఎడ్వంటిస్టు విశ్వాసులలో కొన్ని బైబిలు సిద్ధాంతాల విషయములలో అభిప్రాయ బేధాలు వచ్చినపుడు వైట్‌కు కలిగిన ప్రవచన పరిజ్ఞానము ఎడ్వెంటిస్టు విశ్వాసులను ఐక్యపరచి వారందరు 1840లో జరిగిన సబ్బాతు సదస్సు "సభకు హాజరయ్యే విధముగా ప్రోత్సహించెను. ఆమె పొందిన ప్రవచన కృపావరము దశాబ్దముల తరబడి మంచి ఫలములను ఫలించుటయేగాక, ఆమె వ్రాసిన వర్తమానములు విశ్వాసులైన ఎడ్వంటిస్టు సమాజములో గొప్ప ప్రాబల్యమును చూపించెను.

మూడవదిగా ఎడ్వంటిస్టు తొలి విశ్వాసులు వైట్‌కు కలిగిన దర్శన అనుభవములలో మానవాతీతమైన మూలములతో ప్రమేయమున్నట్లు అంగీకరించి ఆమెను సమర్థించారు. ముందుగానే తెలుసుకున్నట్లు ఆమెకు దర్శనము కలిగినపుడు మానవాతీతమైన కొన్ని గుణములను ఆమెలో వ్యక్తీకరించబడుటను గమనించారు. తెలియని విషయాలను గూర్చి నిజాలను, పరిస్థితులను వివరిస్తూ ఆమెకు సహజముగా ఉన్న శక్తికి మించి సంభవించబోయే వాటి గూర్చి వివరించేవారు.

ఎలెన్‌కు కలిగిన ప్రవచించు కృపావరమును ఆధారము చేసుకొని నేటి ఎడ్వంటిస్టు విశ్వాసులు దర్శనముల ద్వారా ఆమెకు కలిగిన అనుభవాలను, ఆమె ద్వారా తన ప్రజలకిచ్చిన వర్తమానాలను సమర్థించుచున్నారు. ఇట్టి వాదనలు నిజమైనప్పటికి ఆమె రచనలకు సంబంధించిన వ్యక్తిగత అనుభవము ద్వారా ఆమెకు ప్రవచించు కృపావరము ఉందనే శక్తివంతమైన 'రుజువు'గా ఉన్నది. కీర్తనకారుడైన దావీదు మొట్టపెట్టుకున్నట్లు "యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలుసుకొనుడి" (కీర్తన 34:8) ప్రార్థనాపూర్వకముగా ఆమె వ్రాసిన వర్తమానాలను చదివినపుడు మాత్రమే ఆమెకు ప్రవచించు కృపావరము ఉన్నదో, లేదో అని నిర్ణయించగలము.

చాలా పేరు మోసిన క్రీస్తు యొద్దకు మెట్లు అనే చిన్న పుస్తకము ద్వారా ఆమెను గూర్చి మన అన్వేషణ ఆరంభించి 5 సంపుటలు కల్గిన 'యుగయుగాల సంఘర్షణ' ద్వారా ఆదికాండము నుండి ప్రకటన వరకు చూడగలిగే మహాసంఘర్షణ ఆరంభమునకు జాడ కనుగొనగలము. ఆమె వర్తమానములు కాగితము మీద ముద్రింపబడిన విధముగా, ఎలక్ట్రానిక్ రూపములోను పొందగలము. (ఇజి డబ్ల్యు రైటింగ్, ఒఆర్‌జి చూడుడి) ఆమె రచనలను ఆంగ్ల బాషలో నుండి అనేక భాషలలోనికి తర్జుమా చేయబడెను.

❋✷❋